కథ

# చిరంజీవి




సౌందర్య తేజ కోరా
78998 53581


సమయం ఒంటి గంట దాటిపోతున్నది. గేటు పక్క గొలుసుతో కట్టేసి ఉన్న స్నూపీ నిమిషానికోసారి కూర్చుంటూ మళ్లీ పైకి లేస్తూ, ఓసారి గిరగిరా తిరిగి మళ్లీ నిలబడి.. పదేపదే వాష్ ఏరియా వైపున్న వంటగది తలుపు వైపు చూస్తున్నది.

ప్రతిరోజూ ఈపాటికి రెండుసార్లు తినడానికి పెట్టే అమ్మాజీ తన దరిదాపులకు రాలేదు సరి కదా, కంటికి కూడా కనిపించక పోయే సరికి స్నూపీకి అయోమయంగా ఉంది. దాని కడుపు ఆకలితో నకనకలాడుతుంటే.. ఆమెపై కోపం కూడా వస్తున్నది.

బయట స్నూపీ సంగతలా ఉంటే.. ఇంటి లోపల మనుషుల పరిస్థితి కూడా ఇంచుమించు అలాగే ఉంది.

బలరామ్మూర్తి గారికి టిఫిన్ తినని కారణంగా కళ్లు బైర్లు కమ్ముతున్నట్లు అనిపిస్తున్నది. అసలే షుగరు ఉండటం వల్ల ఆయన్ని ఆకలి ఎక్కువగా బాధిస్తుంటే.. కాఫీ అయినా తాగుదామనిపించి కోడలు పద్మని అడిగితే, ఆమె కాఫీ ఇచ్చింది. ఆ కాఫీ కప్పు నోటిదగ్గర పెట్టుకోగానే రుచి సహించక సైలెంటుగా కప్పు పక్కన పెట్టేస్తుంటే చూసిన పద్మ.. మామగారితో అంది.

''ఏం మామయ్యా! ఇది కూడా నచ్చలేదా ఏంది? ఎవరికి నచ్చినా నచ్చకున్న నాకట్లే చాతనైతది.. తాగితే తాగండ్రి.. లేకుంటె మానండ్రి! అసలికీ అమ్మాజీకి ఏం రోగం పుట్టిందో ఏమో.. చెప్పాపెట్టకుండా మానేసె! ఇప్పటికి ఎన్నిసార్లు జెప్పిన.. చిన్నఫోన్ కొని పెడతనె. ఇట్లాంటి అవసరమొస్తె ఫోన్ చెయ్యడానికి పనికొస్తదని. 'నాకెందుకమ్మ పోనూ.. దాన్ల ఎట్ల మాట్లాడాల్నో నాకు తెలియనే దెలియదాయే! పొద్దంతా ఈడ్నే ఉంటగా.. రాత్రైనంకేగా తెలిసినోళ్ల ఇంటి పక్కగదిల పండుకునేతందుకు పొయ్యేది.. మరీ అక్కరపడితె ఆల్లకి చేయండమ్మా' అంట వాళ్ల నంబరు పేపర్ మీద రాపించుకుని తెచ్చె! గాని ఏం లాభం? ఉదయం ఎనిమిది గంటలకెల్లి వాళ్లకి కాల్ జేస్తున్న గాని.. వాళ్లు కాల్ రిసీవ్ చేసుకోటమే లేదాయె! మరీ ఆలస్యమైతందని పొద్దున నేను ఉప్మా జేస్తే.. ఏం రోగమో ఏందో.. ఇంట్ల ఒక్కరంటే ఒక్కరు కూడా తిని చావలే! జర ఆలస్యంగైనా అమ్మాజీ వస్తదిలే అని వంట జోలికే పోలే..''

నిజానికి ఆమె చేసిన ఉప్మా ఆమే తినలేక చెత్త బుట్టలో వేసేసింది. ఇంట్లో తెచ్చి పెట్టుకున్న పళ్లు కూడా నిన్ననే అయిపోతే.. ఈరోజు తెప్పించుకుందాం అనుకుంది. ఇప్పుడేమో కడుపులో ఖాళీఖాళీగా పేగులు లాగేస్తున్నట్టనిపిస్తుంటే.. దాన్నే ఆకలంటారని తెలిసొచ్చి ఆ దుస్థితికి కారణమైన అమ్మాజీ మీద కోపంతో రగిలిపోతూ ఆ కోపంలో మామగారిపై విరుచుకుపడింది పద్మ.

''సర్లే.. గిప్పుడు నువ్వు వంటజేస్తె మాత్రం తినేదెవరంట? అదిగూడ చెత్తబుట్టల బోసేదేగద తల్లీ''.. మనసులో అనుకున్నానని పైకి అనేశారు బలరామ్మూర్తి గారు.

అంతే.. కస్సున లేచింది పద్మ.

''ఏమంటుండ్రు.. నా వంటంత బాగుండదనా మీ ఉద్దేశం! అత్తమ్మ ఉన్న రోజుల్ల గూడ ఆమెని మాత్రానికి మెచ్చుకున్నరా ఏనాడైనా? మీకూ, మీ కొడుక్కి ఎప్పుడు జూసినా పొరిగింట్ల పుల్లకూరేగా మంచిగుండేది. అందుకేగ మీ కొడుకు ఈ అమ్మాజీని వెతికివెతికి తీసుకొచ్చి పెట్టిండు..'' అంటూ రుసరుసలాడింది పద్మ.

నిజం అది కాదు. అత్తగారు ఉన్నప్పుడు 'నువ్వు చెయ్యి' అంటే.. 'నువ్వు చెయ్యి' అంటూ వంతులు వేసుకుని అలక పాన్పులెక్కుతూ, అత్తగారు టీవీ సీరియల్స్ చూస్తూ.. కోడలు కొత్తగా వచ్చిన సెల్‌ఫోన్లో ఫ్రెండ్స్‌తో మాట్లాడుతూ.. షాపింగులకు తిరుగుతూ ఉంటే.. కడుపు మాడ్చుకోలేకా, బైట తినలేకా తన బడ్జెట్లోనే తక్కువ జీతానికి వస్తుందిలే అని వంట మనిషి అమ్మాజీని పెట్టాడు తన కొడుకు భాస్కరం. ఆ విషయం గానీ గుర్తుజేస్తే కోడలు ఉగ్రరూపం ధరిస్తుందని తెలిసిన బలరామ్మూర్తి గారు నచ్చచెబుతున్నట్టుగా.. మెల్లగా..

''అదిగాదు పద్దమ్మా.. నీకు అలవాటు లేదుగా''.. అని నసుగుతూ, ఆకలికి తట్టుకోలేక మాటిమాటికీ నీరసంగా కడుపు తడుముకుంటూ..

'ఛ.. పొద్దుటా ఉప్మ ఎట్లోగట్ల తినేసి ఉంటె మంచిగుండేది.. జర లేటైన ఎట్లయిన అమ్మాజి వస్తాదిలే.. అప్పుడా వంట కాంగానే త్వరగ తినొచ్చులే.. అనుకుని తినకుండా వదిలేసిన.. ఇప్పుడేమొ ప్రాణం బోతున్నట్లు అనిపిస్తుండె' అనుకున్నారు బలరామ్మూర్తి గారు.

స్కూల్‌కి వెళ్లడానికి లంచ్ బాక్సులు రెడీ కాలేదన్న వంకతో ఇంటి దగ్గరే ఉండిపోయిన పన్నెండేళ్ల మనవరాలు వసుధ, పదేళ్ల మనవడు వంశీ చాక్లెట్లూ అవీ తింటూ.. ట్యాబ్‌లో గేమ్స్ ఆడుకుంటుంటే.. మనవడిని పిలిచి..

'అమ్మాజీ ఎందుకు రాలేదో తెలుసుకుని ఆడ్నే